

ఆధ్యాత్మిక ఆవరణల్లోకి చొరబడి విద్వేష భావాల ప్రచారాన్ని నిరసిస్తూ పరస్పర దూషణలను హింసాకాండను వ్యతిరేకిస్తూ శాంతిని సర్వహితాన్ని ఆకాంక్షిస్తూ.. మంగళ వారం ఎల్బీ నగర్ లో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ భవన్ లో అన్నమయ్య కళాక్షేత్రం మరియు హిందూస్ ఫర్ పూరలిటీ అండ్ ఈక్వాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో శాంతివాదం పేరిట జరిగిన వేద పండితులతో జరిగిన వేద సూక్తుల పఠన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. అన్నమయ్య కళా క్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయ శంకర స్వామి, హిందూస్ ఫర్ పూరలిటీ అండ్ ఈక్వాలిటీ,జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాదు త్రినాధ్‌దాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 19 ఫిబ్రవరి 2025 | HYDERABAD











జవహర్‌నగర్‌లో మంగళ వారం నిర్దాక్షిణ్యంగా సాగిన కూల్చివేతలు. తన ఇంటిని కూల్చొద్దంటూ బతిమిలాడిన మహిళ ను ఎత్తుకెళ్తున్న పోలీసులు

# బడుగు జీవులపైకి బుల్‌డోజర్



## నిలువ నీడ లేకుండా క్షణాల్లో గూడు నేలమట్టం

జవహర్‌నగర్, ఫిబ్రవరి 18: రెక్కాడితే గానీ డొక్కాడని జీవితాలు. పొద్దున్నే లేచి కాయకష్టం చేసుకుంటే తప్ప నాలుగు ముద్దలు సంపాదించుకోలేని బతుకులు. ఏవో ఇండ్లల్లో పాచిపని చేసుకుంటూనో, కుట్టుమిషన్లు నడుపుకుంటూనో, తోపుడుబండ్లపై చిన్నా చితకా వ్యాపారం చేసుకుంటూనే రోజులు వెళ్లదీసే అత్యంత పేదలు వాళ్లు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ని హెచ్‌ఎండీఏ భూములు సర్వే నెం. 702, 706లో పేదలు వేసుకున్న రేకుల ఇళ్ళను హెచ్‌ఎండీఏ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సాయంతో మంగళవారం క్షణాల్లో నేలమట్టం చేశారు. దాదాపు 10 కుటుంబాలను ఉన్నఫలంగా రోడ్డుకీడ్చారు. గూడు కూల్చొద్దంటూ బతిమిలాడిన వాళ్లను ఈడ్చుకెళ్లారు. కొంతమందిని ఎత్తుకెళ్లారు. ఏళ్ల తరబడి ఓ మూలకు రేకుల షెడ్లలో తలదాచుకుంటున్న వారందరినీ ఎర్రటి ఎండలోనే బయటికీడ్చారు. పేదల ఇళ్ళపై బుల్డోజర్ తీసుకువచ్చి పూర్తిగా కూల్చివేశారు. 40, 60, గజాల్లో చిన్నపాటి రేకులు వేసుకుని జీవనం సాగించేవారందరూ ఇప్పుడు గూడు లేని అనాథలయ్యారు. ప్రజాపాలన అంటే పేదవాడి గూడు కూల్చడమేనా అంటూ వారంతా విలపిస్తూ నిలదీసినా అధికారులెవ్వరూ కరుణించలేదు.

# కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యుంటే

## మా ఇండ్లు మా కొచ్చేవి.. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లే కావాలె

### కేసీఆర్ కట్టించినవి ఇవ్వండి

### ప్రభుత్వానికి లబ్ధిదారుల మొర

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన ఇండ్ల లిస్టులో తమ పేరు వచ్చినప్పటికీ ఇందిరమ్మ ఇంటి కోసం మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కట్టించి తమను ఎంపిక చేసిందని ఆ ఇండ్లనే తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కిందనైనా తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్‌లనే ఇవ్వాలని కోరుతున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరైన వారికి పట్టాలు పంపిణీ చేయాలని అంటున్నారు.

### 32 వేల మందికి మొండి చేయి

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీహెచ్‌ఎంసీ పరిధిలోని నలుమూలలా లక్ష డబుల్ బెడ్ ఇండ్లు నిర్మించారు. దాదాపు 68 వేల మందికి పైగా పట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన 32 వేల ఇండ్లకు అర్హులను గుర్తించారు. వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరైనట్లు ధ్రువీకరణతో పాటు లబ్ధిదారుల జాబితాను విడుదల చేశారు. పట్టాలు పంపిణీ చేసే సమయానికి శాసన సభ ఎన్నికల కోడ్ రావడంతో ఆపేశారు. ఆ జాబితాలో పేరు వచ్చిన వారు తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వారి గోడును పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కేసీఆర్ గెలిచి ఉంటే తమ ఇండ్లు తమకు వచ్చేవని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్జీలు తీసుకోవడమే తప్ప.. ఇండ్లిస్తామనే భరోసా మాత్రం ఇవ్వడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే నిర్మించి సిద్ధంగా ఉన్న ఇండ్లను అర్హులకు పంచకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.


### 15 నెలల నుంచి కాలయాపన

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావొస్తున్నా ఒక్క పథకంపైనా స్పష్టత లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఏడాది నుంచి దరఖాస్తుల పేరిట కాలయాపన చేస్తూ.. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటిదాకా దరఖాస్తులు చేసుకోవడమే కానీ ఒక్కరికి కూడా లబ్ధి చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు, ఆధార్ కార్డుల జిరాక్స్‌లకే వందలాది రూపాయలు ఖర్చవుతోందని అంటున్నారు. దరఖాస్తుల పేరిట రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడమే కానీ.. ప్రభుత్వ పథకాలు అమలైన దాఖలాలు లేవని నిట్టూరుస్తున్నారు.



నేను 25 ఏండ్లుగా ఖాద్రీబాగ్‌లో ఉంటున్నా. కేసీఆర్ కట్టిచ్చిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరైన లిస్టులో నా పేరుండె. కొంతమందిని బస్సుల్లో తీసుకెళ్లి ఇండ్ల పట్టాలు ఇచ్చిండ్రు. నా పేరు మూడో లిస్టులో ఉంది. నన్ను కూడా బస్సులో తీసుకెళ్లి ఇల్లు ఇస్తమని చెప్పిండ్రు. ఇంత లోపే ఎన్నికల కోడ్ రావడంతో ఇండ్లిచ్చేది ఆపిండ్రు. కేసీఆర్ సార్ మల్ల సీఎం అయితే నాకు ఇల్లొచ్చేది. కాంగ్రెస్ గవర్నమెంట్ల ఇప్పటికి 3 సార్లు దరఖాస్తు చేసుకున్నా. కానీ ఇల్లిస్తమని గ్యారంటీగ చెబ్తలేరు. కేసీఆర్ పాలనలో అన్నీ సమయానికి వచ్చేవి. ఇప్పుడు ఏదీ సక్కగా ఇస్తలేరు. ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోతున్నం.

- ఆంగోత్ తులసి, ఖాద్రీబాగ్, అంబర్‌పేట.



నాకు ముగ్గురు పిల్లలు. బోరబండల బార్బర్‌గ చేస్తున్న. ఎర్రగడ్డల 30 ఏండ్ల నుంచి ఉంటున్న. వచ్చే జీతం ఇంటి కిరాయికే సరిపోతలేదు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అంటూ దరఖాస్తులు తీసుకుంటున్నరు కానీ ఎప్పుడిస్తరో చెబ్తలేరు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ పథకంకూడా సరిగ్గా అమలు చేస్తలేదు. కాంగ్రెసొచ్చి 15 నెలలు అయితున్నది. దరఖాస్తుల పేరుతో రోజుల తరబడి తిప్పించుకుంటున్నరు కానీ పేదోళ్లకు చేసిందైతే ఏమీ లేదు. - ఏముల రామకృష్ణ, ఎర్రగడ్డ.



తుక్కుగూడలో మంగళ వారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలకు గజమాలతో ఘన స్వాగతం పలికిన గులాబీ శ్రేణులు



# హైడ్రాతో రియల్ కుదేలు

## కాంగ్రెస్ పాలనలో 14 నెలల్లో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు

### ఆమనగల్లు రైతు దీక్షలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రంగారెడ్డి, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ), బడంగ్‌పేట/కందుకూరు ఫిబ్రవరి 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాతో అటు హైదరాబాద్ నగరంలోనూ, ఇటు రంగారెడ్డి జిల్లాలోనూ రియల్ ఎస్టేట్‌వ్యాపారం పూర్తిగా కుదేలైందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతుదీక్షకు కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, గువ్వల బాలరాజ్ యాదవ్, బీఆర్ ఎస్ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, పటోళ్ల కార్తీక్ రెడ్డి, మాజీడిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, రామిడి రాంరెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా రైతు దీక్షలో కేటీఆర్ మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి సోదరులు పెద్ద ఎత్తున భూదందాలు సాగిస్తున్నారని వారు మాత్రమే రియల్ ఎస్టేట్‌వ్యాపారం చేసి బాగుపడ్డారని మిగతావారంతా పూర్తిగా నష్టపోయారని చెప్పారు. రంగారెడ్డి జిల్లాలో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల పేరుతో వారు వేల ఎకరాల్లో భూములు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరంటూ ప్రభుత్వాన్ని విమర్శించారు. కాగా, రైతు దీక్ష సభ నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గ అంతా గులాబీమయమైంది. ఆమనగల్ లో నిర్వహించిన రైతు ధర్నాకు మహేశ్వరం నుంచి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. తుక్కుగూడ దగ్గర సబితా ఇంద్రారెడ్డి ఏర్పాటు చేయించిన గులాబీ జెండాను కేటీఆర్ ఎగరవేశారు. బీఆర్‌ఎస్ నేతలు భారీ గజమాలతో కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిలను ఘనంగా సత్కరించారు. జెసిబీ ల సహాయంతో దారి వెంట కేటీఆర్ పై గులాబీ పూల వర్షం కురిపించారు.